వరద కష్టాలకు అడ్డుగోడ

- కరకట్ట వాసులను వీడిన వరద భయం
- ప్రశాంతంగా నిద్రపోతున్న స్థానికులు
- మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి నీరాజనాలు పలుకుతున్న వైనం

ముంపు ప్రాంతాలకు రక్షణ ఛత్రంలా రిటైనింగ్ వాల్



కృష్ణలంకలోని తారకరామనగర్, భూపేష్‌గుప్తానగర్‌కు రక్షణగా నిలిచిన రిటైనింగ్ వాల్(5 లక్షల క్యూసెక్కుల వరద)

కృష్ణలంక(విజయవాడతూర్పు): అక్కడ నివసించే వారంతా రోజు వారీ కూలీ పనులు, ఇళ్లల్లో పనులు, ముఠా పనులు చేసుకుంటూ జీవించే పేదవారే. వర్షాకాలం ప్రారంభమైతే చాలు.. వారి గుండెల్లో రైళ్లు పరుగెత్తేవి. భయం.. భయంగా గడిపేవారు. కృష్ణానదికి వరదలు వస్తే చాలు వారి ఇళ్లన్నీ నీట మునిగేవి. తట్టాబుట్టా సర్దుకుని సురక్షిత ప్రాంతాలకు వెళ్లి తలదాచుకునేవారు. ఆర్థికంగా నష్టపోయేవారు. వరద ఎప్పుడు తగ్గుతుందా అని రోజుల తరబడి నిరీక్షించేవారు. అయితే ఇప్పుడు వారికి ఆ భయం పోయింది. ఆందోళన లేదు. విలువైన వస్తువులు పోతాయనే టెన్షన్ అసలే లేదు. ఎందుకంటే గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తమ కోసం నిర్మించిన రిటైనింగ్ వాల్ వారిని గొప్పగా ఆదుకొని ఇబ్బందుల నుంచి తప్పిస్తోంది.

అప్పట్లో కాళ రాత్రులే..

కృష్ణానదికి వరదలు వస్తున్నాయంటే చాలు కృష్ణలంక పరిధిలోని వరద ముంపు ప్రాంతాలైన రణదీవెనగర్, తారకరామనగర్, భూపేష్‌గుప్తానగర్ వాసులు హడలెత్తిపోయేవారు. ప్రకాశం బ్యారేజీ నుంచి మూడు లక్షల క్యూసెక్కుల వరదను కిందకు వదిలితే చాలు ఆయా ప్రాంతాలను వరద ముంచెత్తేది. ఇళ్లన్నీ నీట మునిగిపోయేవి. కూడబెట్టుకున్న ఆస్తులు, కష్టించి నిర్మించుకున్న ఇల్లు వరదలు పాలవడంతో కొన్ని వస్తువులు, దుస్తులు తీసుకుని కరకట్ట మీదకు చేరుకునేవారు. కొందరు పరదాలు కట్టుకుని అక్కడే ఉండేవారు.. మరికొందరు ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలివెళ్లేవారు. వరద ఎప్పుడు తగ్గుతుందా అని ఎదురు చూసేవారు. ఈ పరిస్థితి నుంచి తమను బయట పడేయాలని ప్రభుత్వాలను వేడుకున్నా.. వరద వచ్చినప్పుడల్లా పునరావాస కేంద్రాలకు తరలించి చాలీచాలని ఆహారం అందజేసి తూతూమంత్రంగా ఆర్థిక సహాయంతో కాలం వెళ్లదీసేవారు. దీంతో విసిగి వేశారిపోయిన ఆ ప్రాంత వాసులు తమకు పరిష్కారం ఎవరు చూపిస్తారా అని ఎదురు చూస్తుండేవారు.

ధైర్యంగా అక్కడే..

ఇప్పుడు కరకట్ట ప్రాంత వాసులు గుండెలపై చేయి వేసుకొని ధైర్యంగా నిద్రపోతున్నారు. ప్రస్తుతం కృష్ణానదికి ఐదారు లక్షల క్యూసెక్కుల వరద వస్తున్నా ఆందోళన లేకుండా జీవిస్తున్నారు. వరద ముంపు నుంచి శాశ్వత పరిష్కారంగా రిటైనింగ్ వాల్‌ను నిర్మించి జగన్‌మోహన్‌రెడ్డి చేసిన సాయాన్ని గుర్తు చేసుకుంటూ ఆయనకు నీరాజనాలు పలుకుతున్నారు. క్షేత్రస్థాయిలో 'సాక్షి' వారిని పలకరించగా ఆనందంతో జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

'నేను విన్నాను.. నేనున్నాను' అంటూ..

ఈ సమయంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వారి బాధలను కళ్లారా చూసిన అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చలించిపోయారు. కృష్ణానదికి 12 లక్షల క్యూసెక్కుల వరద వచ్చినా వరద ఇళ్లల్లోకి రాకుండా ఉండే విధంగా రెండు విడతల్లో రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వెంటనే రిటైనింగ్ వాల్ నిర్మాణానికి సుమారు రూ.400 కోట్లు మంజూరు చేశారు. మొదటి విడతలో కోటినగర్ నుంచి వారధి వరకు, రెండో విడతలో వారధి నుంచి పద్మావతి ఘాట్ వరకు రిటైనింగ్ వాల్‌ను నిర్మించారు. కేవలం రెండేళ్లలోనే రెండు రిటైనింగ్ వాల్‌ల నిర్మాణం పూర్తి చేసి, కరకట్ట ప్రాంత వాసులకు వరదల భయం లేకుండా చేసి, వారి కళ్లల్లో ఆనందం నింపారు.

డ్రెయినేజీ సమస్య కూడా తీరేదే?

కృష్ణానదికి వరదలు వచ్చినప్పుడల్లా రణదీవెనగర్, తారకరామానగర్, భూపేష్‌గుప్తానగర్ ప్రాంతాలలో ఎక్కడికక్కడే డ్రెయినేజీ నీరు, వరద నీరు నిలిచిపోతుంది. దీంతో రోడ్లన్నీ జలమయం అవుతున్నాయి. జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అయి ఉంటే డ్రెయినేజీ సమస్య కూడా తీర్చి తమకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చేసే వారని స్థానికులు అంటున్నారు.



వాల్ నిర్మించక ముందు నీటమునిగిన తారకరామనగర్‌లోని ఇల్లు(ఫైల్)

ప్రశాంతంగా నిద్రపోతున్నాం...



నేడు భార్య పిల్లలతో ప్రశాంతం నిద్రపోతున్నామంటే అది జగనన్న పుణ్యమే. గతంలో కృష్ణానదికి వరదలు వస్తున్నాయంటే కొన్ని సామాన్లు నెత్తిన పెట్టుకుని పునరావాస కేంద్రాలకు తరలిపోయే వాళ్లం. సరైన తిండి లేని, నిద్ర లేక చాలా ఇబ్బందులు పడేవాళ్లం. కానీ ఇప్పుడు 10లక్షల క్యూసెక్కుల వరద వచ్చినా అలాంటి దుస్థితి లేదు. రిటైనింగ్ వాల్ నిర్మించి వరద ముంపు ప్రాంత ప్రజల గుండెల్లో జగనన్న చిరస్థాయిగా నిలిచిపోయారు.

– బాదా సురేష్‌నాయుడు, రణదీవెనగర్, కృష్ణలంక

జీవితాంతం గుర్తుంచుకుంటాం..



మేం 23 ఏళ్లగా కృష్ణలంక, తారకరామనగర్‌లో నివాసం ఉంటున్నాం. గతంలో కృష్ణానదికి మూడు లక్షల క్యూసెక్కుల వరదలు వచ్చినప్పుడల్లా ఇళ్లన్నీ నీట మునిగిపోయి రోడ్డున పడేవాళ్లం. విలువైన వస్తువులు తీసుకునే అవకాశం కూడా ఉండేది కాదు. ఆర్థికంగా నష్ట పోయేవాళ్లం. మా బాధలను గుర్తించిన జగనన్న కృష్ణానదికి రక్షణ గోడ నిర్మించారు. చాలా సంతోషంగా ఉంటున్నాం. మాకు చేసిన మేలు జీవితాంతం గుర్తుంచుకుంటాం.

– అబ్బిరెడ్డి లక్ష్మి, తారకరామనగర్, కృష్ణలంక

క్లుప్తంగా

స్వీయరక్షణపై అవగాహన



పటమట(విజయవాడతూర్పు): బాలికలు, మహిళల చట్టాలపై అందరూ అవగాహన ఉండాలని, శక్తి యాప్ ద్వారా ఆపద సమయాల్లో రక్షణ పొందవచ్చని శక్తి బృందం సభ్యులు వివరించారు. బుధవారం నగరంలోని వివిధ కళాశాలలు, విద్యాసంస్థల్లో మహిళా చట్టాలు, స్వీయ రక్షణ.. బాలికలకు గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అదే విధంగా అనుమానిత ప్రదేశాలపై నిఘా పటిష్టం చేయడంతోపాటు విరివిగా ఆయా ప్రదేశాలను తనిఖీ చేయడం, బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగేవారిని అదుపులోకి తీసుకోవడంతో వారికి మత్తు పదార్థాలను తాగడం వల్ల కలిగే అనర్థాల గురించి అవగాహన కల్పిస్తామని బృంద సభ్యులు తెలిపారు.

23, 24వ తేదీల్లో లైఫ్ సైన్సెస్‌పై సెమినార్



మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): స్థానిక పీబీ సిద్ధార్థ కళాశాల ఆవరణలోని వెబ్‌నార్ హాలులో లైఫ్ సైన్సెస్ ఇన్ ట్రైల్‌బ్లేజింగ్ పాత్ వేస్(థింక్ ఏహెడ్) అంశంపై ఈ నెల 23, 24వ తేదీల్లో జాతీయ స్థాయి సదస్సును నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్ చెప్పారు. కళాశాల ఆవరణలోని సెమినార్ హాలులో సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. అనంతరం రమేష్ మాట్లాడుతూ మానవ వ్యాధులు నివారణ, రోగ నిర్ధారణ–చికిత్స అంశాలతో పాటుగా ప్రత్యేకమైన జన్యు అలంకరణ, పర్యావరణానికి అనుగుణంగా చికిత్సలు, జన్యు చికిత్స, కణ చికిత్సలు, వ్యాక్సిన్‌ల గురించి ఈ సదస్సులో చర్చిస్తామన్నారు. సదస్సులో హైదరాబాద్‌లోని బయోఫౌలింగ్ అండ్ బయోఫిల్మ్ ప్రాసెస్ సెక్షన్(బీబీపీఎస్) సైంటిఫిక్ ఆఫీసర్ డాక్టర్ వై.నాంచారయ్య, సైంటిస్ట్ డాక్టర్ బి.కిరణ్‌కుమార్, ప్రొఫెసర్ నరేష్ సేపురి, ప్రొఫెసర్ డాక్టర్ కె.నాగమోహన్ రిసోర్స్ పర్సన్‌గా హాజరవుతారని తెలిపారు. కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు, డీన్ రాజేష్ సి.జంపాల, వైస్ ప్రిన్సిపాల్ మనోరంజనితో పాటుగా అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కళల్లోనూ విద్యార్థులు రాణించాలి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కళల్లో రాణించిన విద్యార్థులు భావ వ్యక్తీకరణ నైపుణ్యాలను పెంపొందించుకోవటం సులువని రిథమ్ బ్యాండ్ వ్యవస్థాపకుడు సుభాష్ ఎలిసాల అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఏఐ, ఎంఎల్ విభాగాల ఆధ్వర్యంలో యురేకా ఎంటర్‌టైన్‌మెంట్ క్లబ్‌ను బుధవారం ఆ కళాశాల ప్రాంగణంలో ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సుభాష్ ఎలిసాల మాట్లాడుతూ కళలపై మక్కువ, పట్టు సాధించే విద్యార్థులు జీవితంలోనూ మంచి భవితను సొంతం చేసుకుంటారని చెప్పారు. కళాశాల కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్, కోశాధికారి కాజా రాఘవయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. శరవణకుమార్, విభాగాధిపతి వి. నవ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు సత్కారం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని అట్కిన్సన్ విద్యాసంస్థకు విద్యార్థులను చేరవేస్తున్న ఆటోడ్రైవర్లను ఆ సంస్థ యజమాన్యం బుధవారం ఘనంగా సత్కరించింది. అట్కిన్సన్ విద్యాసంస్థ 125 సంవత్సరాల వేడుకల్లో భాగంగా పాఠశాలకు విద్యార్థులను చేరవేస్తున్న సుమారు 200 మంది ఆటోడ్రైవర్లను పాఠశాల యజమాన్యం బుధవారం ఆ సంస్థ వేదికపైకి ఆహ్వానించి గౌరవించింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ రజిత మాట్లాడుతూ తమ విద్యాసంస్థ విద్యార్థులను ఎంతో బాధ్యతయుతంగా చేరవేస్తున్న ఆటో డ్రైవర్ సోదరులను సత్కరించటం తమ బాధ్యతగా భావించి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఆటోడ్రైవర్ల సంఘ నేతలు పసుపులేటి కోటేశ్వరరావు, ఆర్. శ్రీనివాస్, ఎం. కిరణ్‌కుమార్, ఎస్‌కే హుస్సేన్, పడాల నాగరాజు, బుజ్జి, సూరిబాబు తదితరులు పాఠశాల యజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. విద్యాసంస్థ సూపీరియర్ సిస్టర్‌గ్రేస్, ప్రొవిన్షియల్ సూపీరియర్ సిస్టర్ శౌరీ, అడ్మినిస్ట్రేటర్ ఇన్నాసియమ్మ తదితరులు పాల్గొన్నారు.

24న శ్రమైక జీవనం చిత్ర ప్రదర్శన



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మురళీకృష్ణ తదితరులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 24వ తేదీన శ్రమైక జీవనం చిత్ర ప్రదర్శన, వర్తమాన పరిస్థితులలో చిత్రకారుని పాత్ర అనే అంశంపై సెమినార్ నిర్వహిస్తున్నామని ఎం.బి.విజ్ఞాన కేంద్రం కార్యదర్శి పి.మురళీ కృష్ణ పేర్కొన్నారు. బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో సెమినార్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ ఎం.బి.విజ్ఞాన కేంద్రం, ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్, కళాయజ్ఞ సంయుక్త ఆధ్వర్యంలో చిత్రకారుల రాష్ట్ర స్థాయి సెమినార్ జరుగుతుందన్నారు. 24న ఉదయం 10 గంటలకు రాష్ట్రంలోని ప్రముఖ చిత్రకారులు 48 మంది శ్రమైక జీవనంపై వేసిన చిత్రాలతో కూడిన ఎగ్జిబిషన్‌ను చిత్రకళావధాన్ మార్లపూడి ఉదయ్‌కుమార్ ప్రారంభిస్తారని చెప్పారు. ఉదయం 11 గంటలకు వర్తమాన పరిస్థితులలో చిత్రకారుని పాత్ర అనే అంశంపై సదస్సు ప్రారంభమవుతుందన్నారు. సదస్సులో ప్రఖ్యాత కార్టూనిస్ట్ శ్రీధర్, యోగి వేమన విశ్వ విద్యాలయం ఫైన్ ఆర్ట్స్ డిపార్ట్‌మెంట్ డాక్టర్ మృత్యుంజయరావు, సంప్రదాయ చిత్రకళ అధ్యాపకుడు డాక్టర్ సాగర్ గిన్నె, ప్రముఖ చిత్రకారుడు వై.శేషబ్రహ్మం, తెలుగు భాషోద్యమ సంస్థ నాయకుడు ప్రొఫెసర్ గారపాటి ఉమామహేశ్వరావు పాల్గొంటారని తెలిపారు. చిత్రకారులు, చిత్ర కళాభిమానులు పాల్గొని తమ అభిప్రాయాలను పంచుకోవాలని కోరారు. సమావేశంలో అరసవిల్లి గిరిధర్, ఎ.సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దోమల వ్యాప్తిని అరికట్టండి

- వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర
- వైఎస్సార్‌కాలనీలో అవగాహన ర్యాలీ



వైఎస్సార్ కాలనీలో దోమల నిర్మూలనపై అవగాహన ర్యాలీలో కమిషనర్ ధ్యానచంద్ర తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో జక్కంపూడి వైఎస్సార్ కాలనీలోని కమ్యూనిటీ హాల్ వద్ద నిర్వహించిన మలేరియా, డెంగీ నివారణపై అవగాహన ర్యాలీని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర బుధవారం ప్రారంభించారు. నివాసాల్లో, ఇళ్ల పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు ఉన్న ప్రదేశాల్లో లార్వాను గుర్తించారు. వ్యాధుల సంక్రమణపై అవగాహన కల్పించారు. కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర స్థానికులతో మాట్లాడుతూ వ్యాధులు ప్రబలకుండా దోమల వ్యాప్తిని అరికట్టాలన్నారు. ఇంట్లోను, పరిసరాల్లోను నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త వహించాలన్నారు. కూలర్లు, ఫ్లవర్‌వాజ్‌లు, పూల కుండీల్లో నీటిని తరచూ మార్చాలని సూచించారు. అలాగే తాగి పడేసే కొబ్బరి బొండాలు, పనికిరాని పాత టైర్లు, ఖాళీ డబ్బాలులో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు.

దోమల నివారణ వస్తు ప్రదర్శన పరిశీలన

ఈ సందర్భంగా కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన దోమల్లోని వివిధ రకాలు, వాటి జీవిత చరిత్ర, దోమల నివారణకు ఉపయోగించే యంత్ర సామగ్రి, డ్రోన్లు, కటింగ్ మిషన్లు తదితర వస్తు సామగ్రి ప్రదర్శనను కమిషనర్ ధ్యానచంద్ర పరిశీలించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం. సుహాసిని, నగరపాలక సంస్థ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె అర్జునరావు, ఇన్‌చార్జ్ జోనల్ కమిషనర్/ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జె. శ్రీనివాస్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, బయాలజిస్ట్ కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కల్వర్ట్‌పై నుంచి మంచినీటి పైప్‌లైన్ ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్



పైప్‌లైన్‌ను కల్వర్ట్‌పైన పెట్టి నిర్మిస్తున్న దృశ్యం

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఎట్టకేలకు మంచినీటి మెయిన్ పైప్‌లైన్‌ను నూతనంగా నిర్మిస్తున్న కల్వర్ట్‌పై నుంచి ఏర్పాటు చేస్తుండటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. భవానీపురం ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్‌లోని వీరయ్య హోటల్ సెంటర్‌లో నిర్మిస్తున్న కల్వర్ట్ లోపల మంచినీటి మెయిన్‌లైన్ పెట్టేసి పైన శ్లాబ్ వేస్తున్న వైనంపై ఈ నెల 19వ తేదీన 'వాటర్ పైప్‌లైన్‌పై కల్వర్ట్ నిర్మాణమా..!' అన్న శీర్షికతో సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు స్పందించారు. ఆ వాటర్ పైప్‌లైన్‌ను తాజాగా కల్వర్ట్‌పై ఏర్పాటు చేసి దాని కింద శ్లాబ్ వేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. భవిష్యత్‌లో మెయిన్ వాటర్ పైప్‌లైన్‌లో సమస్య వస్తే పరిస్థితి ఏమిటన్న స్థానికుల అనుమానాన్ని నివృత్తి చేస్తూ వారి విన్నపం మేరకు కల్వర్ట్‌పైనే పైప్‌లైన్ ఏర్పాటు చేస్తుండటంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మానవత్వాన్ని చాటుకున్న జీఎన్‌ఆర్ పూర్వ విద్యార్థులు



నరసింహారెడ్డిని కలిసిన పూర్వ విద్యార్థులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): రెండు దశాబ్దాల క్రితం తమతోపాటు చదువుకుని ప్రస్తుతం అనారోగ్యంతో బాధపడుతున్న తోటి విద్యార్థికి జీఎన్‌ఆర్ మునిసిపల్ హైస్కూల్ పూర్వ విద్యార్థులు ఆర్థిక సాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. విద్యాధరపురం లేబర్‌కాలనీలోని జీఎన్‌ఆర్ నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాలలో 2002 నుంచి 2007 వరకు ఎ. నరసింహారెడ్డి చదువుకున్నారు. ఆ తరువాత ఆయన ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తుండగా ఏడాది క్రితం మెదడుకు సంబంధించి అనారోగ్యానికి గురయ్యారు. అనంతరం మూత్రపిండాల సమస్య కూడా తోడై ఆటో డ్రైవర్ వృత్తి పక్కన పెట్టాల్సి వచ్చింది. ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స పొందినప్పటికీ సుమారు లక్ష రూపాయలకుపైగా ఖర్చు కాగా ఇప్పటికీ నెలకు రూ.20వేల మందులు వాడాల్సి వస్తోంది. భార్య చిన్నచిన్న పనులు చేసుకుంటూ భర్తతోపాటు ఇద్దరు చిన్న పిల్లలను పోషిస్తోంది. ఈ నేపథ్యంలో పాఠశాల పూర్వ విద్యార్థులకు ఇటీవల స్కూల్లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో నరసింహారెడ్డి విషయం తెలిసింది. తమతో కలిసి చదువుకున్న మిత్రుడికి సాయం చేయాలన్న ఆలోచనతో అందరూ కలిసి రూ.30వేలు సేకరించి, కొండబడి దగ్గర నివసిస్తున్న నరసింహారెడ్డి ఇంటికి వెళ్లి అతని కుటుంబానికి అందజేశారు. పాఠశాల ఉపాధ్యాయుడు పులిపాటి దుర్గారావు, పూర్వ విద్యార్థులు టి. సాయిరాం, పి. జక్రయ్య, సీహెచ్ ఆనంద్, బి. మోహన్, అనిల్ కుమార్, రాము, శ్రీను, ప్రవీణ్, నాగరాజు పాల్గొన్నారు.

మద్యం మత్తులో డ్రైవింగ్.. ఆరుగురికి జైలు శిక్ష

లబ్బీపేట(విజయవాడతూర్పు): మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఆరుగురికి జైలు శిక్ష, 43 మందికి జరిమానా విధిస్తూ 7వ అడిషనల్ జ్యూడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు తీర్పు చెప్పింది. నగరంలోని 3వ ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 49 మందిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేశారు. అనంతరం వారిని కోర్టులో హాజరు పర్చగా న్యాయమూర్తి ఆర్‌వీఎస్ శర్మ ఆరుగురికి 7 రోజుల జైలుశిక్షణ, 43 మందికి ఒక్కొక్కరికీ రూ.10వేలు జరిమానా విధించారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

భవానీపురం(విజయవాడపశ్చిమ): సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ఈ నెల 22వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యాధరపురంలోగల శ్రీభవానీ గ్యాస్ కంపెనీ (భారత్ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్) వద్ద ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు సంస్థ అధినేత గద్దె శ్రీహరిబాబు తెలిపారు. బుధవారం ఆయన విద్యాధరపురంలోని గ్యాస్ కంపెనీ కార్యాలయంలో మాట్లాడారు. ఉచిత వైద్య శిబిరంలో భవానీ హాస్పిటల్స్, బ్లోసమ్స్ హాస్పిటల్స్ సౌజన్యంతో జనరల్, ఆర్థో, చిల్డ్రన్స్ విభాగాల్లో వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి నాలుగు గంటల వరకు తమ గ్యాస్ కంపెనీ పక్కనే ఉన్న శ్రీవెంకటేశ్వర స్వామి కల్యాణమండపంలో మహిళలకు వెజిటబుల్ వంటల పోటీలు, సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల మధ్య వంట గ్యాస్ వాడకంపై అవగాహన, భవానీపురం, విద్యాధరపురం ప్రాంతాల్లోని నాలుగు కూడళ్లలో గ్యాస్ స్టావ్ ఉచిత సర్వీస్ శిబిరాలను ఏర్పాటు చేశామన్నారు. నేతాజీ హైస్కూల్‌లో విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలుంటాయని చెప్పారు. సాయంత్రం 6 గంటలకు గ్యాస్ కంపెనీ వద్ద జరిగే బహుమతి ప్రదానోత్సవ సభకు మంత్రి కె. పార్థసారథి, డీఎస్‌ఓ పాపారావు, భారత్ గ్యాస్ టెరిటరీ మేనేజర్ వేణుగోపాల్ హాజరుకానున్నట్లు వివరించారు.

గుర్తింపు కార్డు ఉంటేనే వ్యాపారానికి అనుమతి

పటమట(విజయవాడతూర్పు): గుర్తింపు కార్డు ఉంటేనే వీధిలో వ్యాపారం చేసుకునేందుకు అనుమతి ఉంటుందని, వీధి విక్రయదారులకు గుర్తింపు కార్డులు, వెండింగ్ సర్టిఫికెట్లు జారీ చేస్తున్నట్లు విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వీధి విక్రయదారుల చట్టం 2014 ప్రకారం నగరంలో వివిధ రకాల వీధి వ్యాపారాలు చేస్తున్న వారందరూ గుర్తింపు కార్డు, వెండింగ్ సర్టిఫికెట్లను పొందాలన్నారు. అందుకు గానూ రూ.200 చెల్లించాలని అన్నారు. ఈ మొత్తాన్ని కమిషనర్ వీఎంసీ టౌన్ వెండింగ్ కమిటీ పేరుతో ఉన్న ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ విజయవాడ బ్రాంచ్ ఖాతా నంబర్ 010101000025000, ఐఎఫ్ఎస్సీ కోడ్ ఐఓబీఏ0000101నకు జమచేసి చెల్లించి తగు రసీదు/చలానా/కౌంటర్ ఫాయిల్, యూపీఏ ద్వారా పేమెంట్ చేసేవారు ఫోన్ స్క్రీన్ షాట్ ప్రింట్ కాపీలను వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని యూసీడీ విభాగంలో సమర్పించాలన్నారు.

వైభవంగా నందీశ్వరునికి రుద్రాభిషేకం



నందీశ్వరునికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు



స్వామి వారికి పూజలు చేస్తున్న భక్తులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని పురాతన ఆలయమైన పాత శివాలయంలో నందీశ్వరునికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. నగరంలోని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం (పాతశివాలయం)లో త్రయోదశని పురస్కరించుకొని ప్రత్యేక వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. ప్రతి మాసంలోనూ త్రయోదశి రోజున నందీశ్వరునికి ప్రత్యేక అభిషేకాలను నిర్వహించటం ఆనవాయితీ. అందులో భాగంగా బుధవారం సాయంత్రం ప్రదోషకాలంలో నందీశ్వర స్వామి వారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు. విశేష పుష్పాలంకరణ, పంచహారతులు తదతర కార్యక్రమాలను జరిపించారు. అలాగే స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు.

భీమనవారి పేటలో విశేష అభిషేకాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): త్రయోదశిని పురస్కరించుకుని బుధవారం సాయంత్రం భీమన వారి పేటలోని శ్రీ విజయదుర్గా రామలింగేశ్వర స్వామి వారి సన్నిధిలో నందీశ్వరుడికి విశేష అభిషేకాలను నిర్వహించారు. ఆలయ అర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి, పవన్‌కుమార్ శర్మ నందీశ్వరుడికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని అలంకరించి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. పెద్ద ఎత్తున ఉభయదాతలు, భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.

బుడమేరు సక్రమంగా పారేలా చూడండి

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర



బుడమేరులో వ్యర్థాల తొలగింపుపై అధికారులకు సూచనలిస్తున్న వీఎంసీ కమిషనర్

పటమట(విజయవాడతూర్పు): బుడమేరుకు ప్రవాహానికి అడ్డంకిగా ఉన్న అన్ని వ్యర్థాలను వెంటనే తొలగించాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. నగర పర్యటనలో భాగంగా ఆయన బుధవారం కృష్ణలంక, ఇన్నర్ రింగ్ రోడ్డు, రామవరప్పాడు బుడమేరు వంతెన, 33 తూములు, గుణదల గేటు, భరతమాత కాలనీ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బుడమేరులో తీస్తున్న పూడికలలో భాగంగా భరతమాత కాలనీలో లాంగ్ పొక్లయినర్‌తో తీస్తున్న వ్యర్థాలను పరిశీలించారు. బుడమేరు కాలువ చిట్టచివరి వరకు ఎలాంటి అవాంతరాలు లేకుండా సక్రమంగా నీటి ప్రవాహం ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వంతెనల వద్ద పేరుకుపోయిన వ్యర్థాలను బోట్ల సహాయంతో తొలగిస్తున్న తీరును పరిశీలిస్తూ ఇంజినీరింగ్ అధికారులు డ్రోన్‌తో బుడమేరు ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని, బుడమేరుకు ఇరువైపులా ఉన్న ఎలక్ట్రిసిటీ పోల్స్ ప్రమాదకరమైన స్థితిలో ఉన్నాయని, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా ఉండేందుకు, ఏపీ సీపీడీసీఎల్ వారికి లేఖ రాయాలని చీఫ్ ఇంజినీర్‌ని ఆదేశించారు.

చెట్లు పెంచాలి..

విజయవాడ నగరంలో పెరుగుతున్న కాలుష్యం, జనాభాకి తగ్గట్టుగా మొక్కల శాతాన్ని పెంచాలని, రోడ్డులకు ఇరువైపులా ఎవెన్యూ ప్లాంటేషన్ చేయాలని, ఖాళీగా ఉన్న డివైడర్ల పైన మొక్కలను మార్చాలని, నగర ప్రజలకు ఆరోగ్యకరమైన గాలిని అందించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో ఎగ్జిక్యూటివ్ జూనియర్ శ్రీనివాసరెడ్డి డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సింధూర, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గగుడిలో అంతర్గత బదిలీలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో చేపట్టిన అంతర్గత బదిలీలు సర్వత్రా చర్చనీయాంశంగా మారాయి. దసరా ఉత్సవాలకు మరో నెల రోజులు ఉండగా, ఆలయంలోని కీలక విభాగాల్లో సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్‌లతో పాటు 31 మందికి అంతర్గత బదిలీలు చేస్తూ ఈవో శీనానాయక్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. అయితే ఈ దఫా నిర్వహించిన ఉద్యోగుల బదిలీలలో దేవస్థానానికి సంబంధించిన దత్తత సంస్థకు బదిలీపై వచ్చిన ఓ అధికారి కీలక పాత్ర పోషించినట్లు దేవస్థానంలో ప్రచారం జరుగుతోంది. సూపరింటెండెంట్లలో పి. భాగ్యజ్యోతి ప్రసాదాల తయారీ నుంచి అన్నదానానికి, వి. సూర్యనారాయణమూర్తి వేద పాఠశాల, దత్తత దేవాలయాలు, సత్రాలు, ప్రొటోకాల్ విధులు నిర్వర్తిస్తుండగా, ఆ విధుల నుంచి తప్పించారు. కె. శ్రీనివాసరావుకు ప్రొటోకాల్, డోనర్‌సెల్, కొండపై కౌంటర్లు, డీసీఆర్ స్టాక్ రిజిస్టర్ పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. సీహెచ్ నరసింహారావుకు ల్యాండ్స్, లీజెస్, లీగల్ విభాగాలతో పాటు ఈవో పేషీ సూపరింటెండెంట్ బాధ్యతలు అదనంగా అప్పగించారు. కొర్లె శ్రీనివాసరావుకు ప్రసాదం తయారీ, కొండ దిగువన ప్రసాదాల కౌంటర్ల నిర్వహణ బాధ్యతలు, ఎల్.శ్రీనివాసరావుకు కేశ ఖండనశాల, శానిటేషన్, దుర్గాఘాట్ నిర్వహణ, హారతుల నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. ఐటీ, జీఎస్టీ, రిటన్స్, టోల్ ఫ్రీ కౌంటర్ల నిర్వహణ బాధ్యతలు నిర్వర్తిస్తున్న పి.సునీతకు అదనంగా ధర్మపథం, దాతల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకునే బాధ్యతలు అప్పగించారు.